కొత్త గనుల ఏర్పాటుకు పూర్తి సహకారం 6లో..

సమ్మెను నీరుగార్చిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ 6లో..



ఇసుక తవ్వకాలపై సర్కారు దృష్టి

- భవన నిర్మాణాలు పెరగడంతో ఏర్పడిన డిమాండ్
- మానేరులోని ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు రంగం సిద్ధం
- త్వరలో డీఎల్ఎస్‌సీ సమావేశం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మానేరులో నిలిపివేసిన ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం. రాష్ట్రంలో భవన నిర్మాణాలు పెరగడంతో దానికి కావలసిన ఇసుక కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని మానేరులోగల ఇసుక రీచుల్లో తవ్వకాలు చేపట్టేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మానేరుపై ఏర్పాటుచేసిన 25 ఇసుక రీచులకు సంబంధించి తవ్వకాల కాలపరిమితి డిసెంబరు నెలాఖరుతో ముగియడంతో కలెక్టర్ ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. గడువులోపు తవ్విన ఇసుకను డంపింగ్ యార్డులో నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా విక్రయిస్తున్నారు. ఇసుక తవ్వకాల్లో అక్రమాలు జరిగాయని, బుకింగ్‌కు మించి ఓవర్‌లోడ్‌తో ఇసుకను తరలిస్తున్నారని, కొన్నిచోట్ల వేబిల్లులు లేకుండానే ఇసుకను తరలిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక తవ్వకాలపై దృష్టి సారించింది. అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు ఓవర్‌లోడ్ లేకుండా చర్యలు చేపట్టింది. ఎక్కడికక్కడే విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ తదితర ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టారు. రాష్ట్ర రాజధానిలో దినదినం పెరుగుతున్న భవన నిర్మాణాలకు తీవ్రమైన ఇసుక కొరత ఏర్పడింది. ఇసుక ధరలు ఆకాశాన్ని అంటాయి. ఆయా రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా గడువు ముగియడం వల్లనే ఇసుక తవ్వకాలు ఆగిపోయాయి. ఇసుక కొరత నేపథ్యంలో విధివిధానాల్లో మార్పులు, చేర్పులు చేసి, అక్రమాలు జరగకుండా ఇసుక తవ్వకాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇసుక తవ్వకాల వల్ల కొరతను తీర్చడంతో పాటు ప్రభుత్వానికి తద్వారా ఆదాయం వస్తుందని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పెద్దపల్లిలోగల మానేరు నదిలో ఇసుకను తోడే విషయమై దృష్టి సాధించినట్లు సమాచారం.

● కలెక్టర్ నేతృత్వంలో సమావేశం..

మానేరు నదిపై సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, గట్టేపల్లి, కదంబాపూర్, తొగర్రాయి, ఓదెల మండలం మడక, గుండ్లపల్లి, కనగర్తి, పొత్కపల్లి, రూపునారాయణపేట, ఇందుర్తి, గుంపుల, కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట్, మొట్లపల్లి, ముత్తారం మండలం ఓడేడు, అడవి శ్రీరాంపూర్, మంథని మండలం గోపాలపూర్, చిన్న ఓదాల వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యాం ల్లో 132,00,000 క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడి తరలించేందుకు 25 రీచుల కోసం 2022 జనవరి 11వ తేదీన టీఎస్ఎండీసీ ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానించింది. చెక్‌డ్యామ్ లోపల పెద్దఎత్తున ఇసుక పేరుకుపోయిందని, దీని వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరగదని, రెండు మీటర్ల లోతు వరకు ఇసుక తొలగించాలని సంబంధిత అధికారులు నివేదిక ఇచ్చారు. ఆ మేరకు టీఎస్ఎండీసీ ద్వారా ఇసుకను తరలించేందుకు టెండర్లు జారీ చేసింది. ఇసుక రీచుల్లో ఇసుకను తోడి వాహనాల ద్వారా డంపింగ్ యార్డుల వరకు తీసుకవచ్చి అక్కడ లోడింగ్ చేసేందుకు టెండర్లను ఆహ్వానించారు. పలువురు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొని ఇసుక రీచులను దక్కించుకున్నారు. డిసెంబరు 31 వ తేదీ వరకు మానేరు ఇసుక తీసిన నుంచి సుమారు 65 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను అధికారికంగా విక్రయించారు. అనధికారికంగా మరో 20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తరలించినట్లు తెలుస్తున్నది. జిల్లా స్థాయి సాండ్ కమిటీ విధించిన గడువు డిసెంబరు నెలాఖరుతో ముగియడంతో ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. చెక్‌డ్యాం లోపల ఇంకా ఉందని, ఆ ఇసుకను తోడితేనే చెక్ డ్యాముల్లో నీళ్లు నిలువ ఉంటాయని సంబంధిత అధికారులు భావిస్తున్నారు. లక్షా 32 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వాలని లక్ష్యం పెట్టుకోగా, అధికారికంగా 62 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వారు. ఇంకా సుమారు 50 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తొలగించాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. మానేరులో ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతాయని, దుమ్ము ధూళితో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నదని, ఓవర్ లోడుతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని మానేరు పరిరక్షణ సమితి ఇసుక ప్రజలను నిలిపివేయాలని చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించిన తీర్పు పెండింగ్‌లో ఉన్నది.

కాగా, ఈనెలాఖరులో గానీ, మార్చి మొదటి వారంలో గానీ కలెక్టర్ నేతృ త్వంలో జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించి ఇసుకతో తవ్వకాలపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇసుక రీచ్‌లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటివరకు మాకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని, ఇసుక తవ్వకాల బాధ్యత తమకే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇసుక రీచ్‌లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

మంథని మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లపై నెగ్గిన అవిశ్వాసం

- ప్రత్యేక సమావేశానికి హాజరైన 9 మంది కౌన్సిలర్లు



అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

మంథని, ఫిబ్రవరి 16: మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్‌లపై పెట్టిన అవిశ్వాసం శుక్రవారం నెగ్గింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారిగా మంథని ఆర్డీవో హనుమానాయక్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి 9 మంది కౌన్సిలర్లు హాజరుకాగా మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్‌తోపాటు ఇద్దరు కౌన్సిలర్లు గిరెపల్లి సత్యనారాయణ, కాయితీ సమ్మయ్యలు గైర్హాజరయ్యారు. మొదటగా ఆర్డీవో హనుమానాయక్ చైర్‌పర్సన్, అనంతరం వైస్‌చైర్మన్‌ల అవిశ్వాసానికి తీర్మానం చేయగా 9 మంది కౌన్సిలర్లు చేతులెత్తి మద్దతు ప్రకటించారు. మున్సిపాలిటీలో 13మంది కౌన్సిలర్లుండగా మెజార్టీ సభ్యులు 9మంది ఇచ్చిన ఆవిశ్వాసం నోటీస్‌పై ఈనెల 16న మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు ఈ సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా మంథని ఆర్డీవో హనుమానాయక్‌ను నియమించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో 9మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్‌లు తమ పదవులు కోల్పోయారు. అవిశ్వాసం నెగ్గిన వెంటనే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మున్సిపల్ కార్యాలయం సమీపంలో బాణాసంచా పేలుస్తూ సంబురాలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు : డీఈవో మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో మాధవి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 16 : జిల్లావ్యాప్తంగా మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ప్రతి డిపార్మెంటల్ అధికారి చీఫ్ సూపరిండెంట్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి మాధవి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పరీక్షల విధుల్లో పాల్గొననున్న చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్మెంటల్ ఆఫీసర్లు, వెహికల్ ఇన్‌చార్జిలు, రిజర్వ్ అధికారులు అందరికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలోని ఆయా అధికారుల సపోర్ట్ తీసుకుని నిర్వహించాలని ఆమె కోరారు. శిక్షణ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్‌కమిషనర్ మూల రాంరెడ్డి పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతం దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి16: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గోదావరిఖని మెడికల్ కళాశాలలో విజృంభిస్తున్న ర్యాగింగ్ భూతం దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. స్థానిక రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా, ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ప్రీతమ్, నితీలేష్, రాహుల్, శంకర్, సాయిచరణ్ పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలి

- మెడికల్ కళాశాలకు అనుబంధంగా వెయ్యి పడకల ఆసుపత్రి నిర్మించాలి..

- రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ స్టేషన్ ఇవ్వండి - అసెంబ్లీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



అసెంబ్లీలో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఫిబ్రవరి 16: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సుప్రీం కోర్టు తీర్పు, జీవో నంబరు22 ప్రకారం సమాన పనికి సమాన వేతనం కింద హైపవర్ కమిటీ సిఫార్సు చేసిన వేతనాలు ఇవ్వాలని రామగుండం శాసనసభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన రామగుండం సమస్యలపై గళం విప్పారు. రామగుండం గతంలో రాష్ట్రం నుంచి ఎవరు వచ్చినా ఉపాధి ఇచ్చేదని, కానీ ఇప్పుడు ఈ ప్రాంతంలో ఉపాధి లేక బొందల గడ్డగా మారిందన్నారు. నగరంలో నడిబొడ్డున ఓపెన్‌కాస్టు పెట్టారని, దీంతో ప్రతి పది ఇండ్లకు ఒకరు పక్షవాతానికి గురవుతున్నారన్నారు. సింగరేణిలో 40వేలమంది పర్మినెంట్ కార్మికులు పని చేస్తుంటే అంతకంటే ఎక్కువగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, పర్మినెంట్ కార్మికులు చేసే అన్ని పనులు కాంట్రాక్టు కార్మికులు చేస్తున్నారన్నారు. పర్మినెంట్ కార్మికులకు నెలకు రూ.60వేల నుంచి రూ.1లక్ష వేతనం ఉంటే కాంట్రాక్టు కార్మికుల మాత్రం రూ.6వేల నుంచి రూ.10వేల వేతనం ఉంటుందన్నారు. పర్మినెంట్ కార్మికులు మరణిస్తే రూ.కోటి నష్టపరిహారం ఇస్తున్నారని, కాంట్రాక్టు కార్మికులు చనిపోతే నష్టపరిహారం కోసం బేరసారాలు ఆడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఆరుగురు కార్మికులు ప్రమాదానికి గురై వారి శరీర భాగాలు కూడా ముక్కలు ముక్కలయ్యాయని, అలాంటి వారికి సరైన పరిహారం రాని పరిస్థితి ఉందన్నారు. రామగుండంలో కూలీ చేసే వారు సైతం పిల్లలను బాగా చదివిస్తారని, ప్రతి ఇంట్లో ఎంబీఏ,ఎంసీఏ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఉన్నారని, ఇలా 30వేల మంది గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన నిరుద్యోగులు ఉన్నారన్నారు. తాను వార్డుల్లోకి వెళ్లిన సందర్భంలో ఒక అమ్మాయి తన తండ్రితో కలిసి మేషన్ పనిలో హెల్పర్‌గా పనిచేస్తున్నారని, ఏం చదువుకున్నావని అడిగితే ఎంబీఏ పూర్తి చేశానని, తమ్ముడు బీటెక్ పూర్తి చేశారని చెప్పిందన్నారు. ఇలాంటివారు ఉపాధి లేక వేలసంఖ్యలో ఉన్నారన్నారు. అందువలన రామగుండం సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. జెన్‌కో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను నెలకొల్పాలన్నారు. పక్కనే గోదావరి ఉన్నా రామగుండానికి మిషన్ భగీరథ లేదని, ఎస్‌టీపీలు పని చేయవన్నారు. సింగరేణి కార్మికులు కలుషిత నీరు తాగే దుర్భర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వెంటనే రామగుండంలో ఎస్‌టీపీలను నెలకొల్పాలన్నారు. రామగుండం నగరపాలక సంస్థలో నిధులు లేవని, సిబ్బంది లేరని, కమిషనర్లు కూడా లేరన్నారు. సింగరేణికి సంబంధించిన నిధులను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయారని, భవిష్యత్‌లో ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే డీఎంఎఫ్‌టీ నిధులు ఇవ్వాలని, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు.మెడికల్ కళాశాలలకు సింగరేణి రూ.500కోట్లు నిధులు ఇచ్చిందని, ఇందులో రూ.280కోట్లు మాత్రమే విడుదల య్యాయని, మిగతా నిధులు విడుదల కాలేదన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా వెయ్యి పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని రాజ్‌ఠాకూర్ కోరారు.

గత ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ నిధులు తరలించుకుపోయింది..

- మంత్రి కోమటిరెడ్డి

సింగరేణికి చెందిన డీఎంఎఫ్‌టీ నిధులను గత ప్రభుత్వం గజ్వేల్‌కు, సిద్ధిపేటకు, ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయిందని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. సింగరేణి ప్రాంత సమస్యలపై త్వరలోనే పరిష్కారానికి చర్యలు చేపడుతామని ఆయన హామీ ఇచ్చారు.

ర్యాగింగ్ ఘటనలో నలుగురిపై చర్యలు

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 16: రామగుండం మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ చోటుచేసుకోవడం బాధకరమని, ఈ ఘటనలో నలుగురు విద్యార్థులపై చర్యలు తీసుకున్నట్టు రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు చెప్పారు. శుక్రవారం మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఘటన జరిగిన రోజు తాను లేనని, ఏదైనా విద్యార్థులు ర్యాగింగ్ చేయడం తప్పని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. రామగుండంకు మెడికల్ కళాశాల రావడం ఇక్కడి ప్రజలకు ఉపయోగంతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని, పరిశ్రమలు ఉన్నాయని, భవిష్యత్‌లో కూడా రామగుండం మెడికల్ కళాశాలకు ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సిన అవసరం ఉన్నందున చిన్నచిన్న సంఘటనలు జరిగితే వాటిని భూతద్దంపెట్టి చూపవద్దని కోరారు. రామగుండం మెడికల్ కళాశాల, దానికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి కూడా నిధులు రావాల్సి ఉందని, డయాలసిస్ కేంద్రాన్ని రోగుల కోసం కింద అంతస్థులో ఏర్పాటు చేయడం జరిగిందని, దాని కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, నిధులు రావడంలో జాప్యం జరుగుతుండడంలో పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ రాజు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీడీవోగా శ్రీనివాస్‌గౌడ్

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : పెద్దపల్లి నూతన ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన జి.శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయం సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్ఐలుగా బాధ్యతల స్వీకరణ

రామగిరి, జ్యోతినగర్, కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 16: రామగిరి పోలీసుస్టేషన్‌కు నూతన ఎస్ఐగా సందీప్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఎన్టీపీసీ ఎస్ఐగా టి.ఉదయ్ కిరణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన జీవన్‌న బదిలీ(వీఆర్) చేశారు. కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐగా ఓంకార్ యాదవ్ బాధ్యతలు చేపట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పని చేస్తున్న ఓంకార్‌యాదవ్ కాల్వ శ్రీరాంపూర్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16: తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జొన్నకోటి వెంకటేశ్ శుక్రవారం సుల్తానాబాద్ ఎంపీడీవోను కోరారు. అలాగే కొత్తగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. ఆసరి రమేష్, గసికంటి శ్రీనివాస్, వెంకటేష్, రాంరెడ్డి, అనురాధ, సాగర్, శ్రీనివాస్, వికాస్,రాజు, సాయినాథ్, శంకర్, రాజేందర్ పాల్గొన్నారు.

విషజ్వరంతో చిన్నారి మృతి

రామగిరి, ఫిబ్రవరి 16: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన ఎం సాద్విక (4) అనే చిన్నారి జ్వరంతో మృతిచెందింది. గత రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సాద్వికను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం పరిస్థితి విషమించడంతో మృతిచెందింది.

సేవా కేంద్రం ప్రారంభం

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 16: జిల్లాకేంద్రంలోని భూంనగర్‌లో మాతృశ్రీ కామన్ సర్వీసు సెంటర్లో పోస్టల్ డాక్ మిత్ర సేవా కేంద్రాన్ని పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఆరుకాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 16: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ టికెట్ కొప్పుల శంకర్‌కు ఇవ్వాలని పార్టీ అనుబంధ లీగల్ సెల్ ఉపాధ్యక్షులు నూతి సురేష్ కుమార్, బర్ల రమేష్‌లు కోరారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మాదాసు శ్రీనివాస్, జాయింట్ కన్వీనర్ బొడ్ల గణేష్, తగరపు రమేష్, గంగుల చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణమూర్తి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : విద్యార్థులపై సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైం పోలీస్ ఆధ్వర్యం లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వెంటనే సైబర్ నేరాల గురించి 1930అనే టోల్‌ఫ్రీ నంబర్ లేదా https://cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. హెడ్ కానిస్టేబుల్ అట్టెం శంకర్, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, నిమ్మతి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీనర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయం ఎదుటే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- మోసపూరిత వాగ్దానాలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలి - బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

పెద్దపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదుటనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఈనెల 17న పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను గ్రామగ్రామాన నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ జిల్లా ఆఫీసులో జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మెరుగైన పాలన అందించకుండా గత ప్రభుత్వాన్ని నిందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని నిందిస్తూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. కానీ ప్రజలు ప్రభుత్వ పాలనను పరిశీలిస్తున్నారని, ఎన్నికలకు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు ఇచ్చిందని వారికి అర్థమవుతుందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే వరకు వారిని నిలదీయాలని ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కోరారు. తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అనేక అభివృద్ధి పనులు చేయడంతో పాటు, సంక్షేమ పథకాలను అమలుచేసిందని గుర్తుచేశారు. కొత్త సచివాలయాన్ని నిర్మించి దానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పెట్టామని, వంద అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి దళిత సామాజిక వర్గానికి ధైర్యాన్ని ఇచ్చామన్నారు. దళిత బంద్ పథకంతో అనేక మందికి ఆత్మస్థైర్యాన్ని అందించామన్నారు. తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ అమర జ్యోతిని ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఆ స్థలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సరైనది కాదన్నారు. ఆయన మాజీ ప్రధాని అని, ఆయన విగ్రహాన్ని ఎక్కడైనా పెట్టవచ్చని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ఎదుటనే నిలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను గ్రామ గ్రామాన, పట్టణాల్లో ఘనంగా నిర్వహించాలని, ఈ సందర్భంగా సహాయ కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం రెండు గంటలకు స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాలలో సహాయ కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెంట రాజేష్, పిటి స్వామి, పీట్ల గోపాల్, ఉప్పు రాజ్‌కుమార్, మెతుకు దేవరాజు, జక్కుల తిరుపతి, సత్యనారాయణ, చెలకలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన రామగుండం నగర కమిషనర్



కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు, సిబ్బంది

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: రామగుండం నూతన కమిషనర్‌గా నియమితులైన సీహెచ్ శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మేయర్ బంగి అనీల్ కుమార్‌తో సమావేశమయ్యారు.

సమ్మక్క-సారలమ్మ జాతర పనుల పరిశీలన

రామగుండం నగర పాలక కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ శుక్రవారం గోదావరి తీరంలోని సమ్మక్క- సారలమ్మ జాతర పనులను పరిశీలించారు. శ్రీకాంత్‌కు జాతర కమిటీ చైర్మన్ శ్రీని వాస్‌రెడ్డి స్వాగతం పలికారు. ఆయన పూజలు నిర్వహించి అధికారులతో జాతర ఏర్పాట్లపై చర్చించారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, శానిటేషన్ అధికారులు ఉన్నారు.

పెద్దబొంకూరులో వెలగని విద్యుత్ దీపాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : మండలంలోని పెద్దబొంకూర్‌లో గత కొన్ని రోజులుగా పలు కాలనీల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో ఓ వైపు కోతుల బెడద ఎక్కువగా ఉందని, రాత్రి అయ్యిందంటే చీకట్లో బయటకు రాలేని పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు. గ్రామంలోని సగం మేర కాలనీల్లో విద్యుత్ దీపాలు వెలుగక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

రామగిరి, ఫిబ్రవరి 16: మండలంలోని లద్నాపూర్‌లో కేవీకే, సింగరేణి సంయుక్తంగా సేంద్రియ వ్యవసాయ సాగు విధానంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. కార్యక్రమానికి ఏపీఏ ఎస్‌వోటూ జీఎం భైద్య ముఖ్యఅతిథిగా హాజరై గ్రామస్తులకు వివిధ రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సెంద్రియ పంటల వల్ల కలిగే లాభాలను వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

● లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16: జిల్లా స్థాయి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన, నినాదాలు, పోస్టర్ మూడు విభాగాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. 'నేను రాత్రి పూట మిలినీయర్‌గా మారినట్లయితే, నేను ఆ డబ్బును ఎలా ఉపయోగించగలను' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించడం జరుగుతుందని, 300 పదాలతో ఇంగ్లీష్, తెలుగు, హిందీ బాషల్లో రాయవచ్చని అన్నారు. 'సమ్మేళనం యొక్క పొదుపు, శక్తి' అనే అంశంపై నినాదాల పోటీని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆంగ్లం, తెలుగు, హిందీ భాషల్లో ఉంటుందని అన్నారు. పోస్టర్ పోటీ 'డిజిటల్, సైబర్ పరిశుభ్రత అనే అంశంపై చేతితో డ్రా లేదా డిజిటల్‌గా కానీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ భాషల్లో వేయవచ్చని అన్నారు. పాల్గొనే వారి పేరు, పాఠశాల, కళాశాల పేరు, పబ్లిక్, ప్రైవేట్, పాల్గొనే వారి వయస్సు, కాంట్రాక్టు నెంబర్ పార్టిసిపెంట్/గార్డియన్‌ది పేరు దరఖాస్తుల్లో పాల్గొనాలని సూచించారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ మూడు పోటీల్లో విజేతలకు బహుమతి, సర్టిఫికెట్ ప్రదానం, రాష్ట్రస్థాయిలో బహుమతి, సర్టిఫికెట్‌తో పాటు సన్మానం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 22 సాయంత్రం 5 గంటలలోపు కేఎస్‌ఆర్ లీడ్‌బ్యాంక్ ఈమెయిల్‌కు వ్యాసం, నినాదం, పోస్టర్‌లను పంపించాలని సూచించారు.

హైకోర్టు ఎదుట హాజరైన కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌వో

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓ బాధితురాలు ఫిర్యాదు చేసినా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేసిన వ్యవహారంలో కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌వో హైకోర్టు ఎదుట హాజరయ్యారు. కరీంనగర్‌లో ఓ జడ్జి కొడుకుపై ఉద్యోగం కోల్పోయిన ఆఫీస్ సబార్డినేట్ ఆరోపణలకు సంబంధించి నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను హైకోర్టుకు అందజేశారు. తాము ఆదేశించినా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోవడంపై సదరు ఎస్‌హెచ్‌వోపై రెండురోజుల కింద హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌వో శుక్రవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఫిర్యాదుదారు (పిటిషనర్) ప్రవర్తన సైతం బాగాలేకపోవచ్చు.. ఉద్యోగం పోయిన తర్వాతే ఆమె ఫిర్యాదు చేసి ఉండొచ్చు. కానీ ఆ అంశాల మెరిట్స్‌పై మేం ఎలాంటి వ్యాఖ్య చేయడం లేదు. అవన్నీ దర్యాప్తులో తేలాలి. కానీ నమోదు చేయదగ్గ నేరానికి (కాగ్నిజబుల్ అఫెన్స్) సంబంధించి పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోవడం తీవ్రమైన అంశం. ఒక మహిళ పోలీస్‌స్టేషన్‌కు ఎందుకు వస్తుంది. అది టూరిస్టు కేంద్రం లేదా సినిమా థియేటర్ కాదు కదా? ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు వేచి ఉంచి ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పడం సరికాదు. పౌరులు ఎలాంటి భయం లేకుండా పోలీస్‌స్టేషన్ వచ్చేలా వర్క్‌షాప్ పెట్టేలా డీజీపీకి సూచించండి' అని ధర్మాసనం పేర్కొంది. ఫిర్యాదు చేసినప్పుడు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయక పోవడానికి కారణాలను వివరిస్తూ లిఖితపూర్వక వివరణ సమర్పించాలని సదరు పోలీసు అధికారికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

తండ్రిని హతమార్చిన తనయుడు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16: పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట్ గ్రామానికి చెందిన యాదగిరి ఓదెలు (55)ను అతని కుమారుడు రాజు కత్తితో పొడిచి హత్య చేసాడు. సంఘటనపై సమాచారం అందుకున్న పెద్దపల్లి ఏసీపీ ఎ.కృష్ణ, పెద్దపల్లి సీఐ కృష్ణ, పెద్దపల్లి ఎస్‌ఐలు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పాఠశాల విద్యార్థులకు 'స్నేహిత' అవగాహన కార్యక్రమం

తిమ్మాపూర్, ఫిబ్రవరి16: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల కేంద్రీయ విద్యాలయ, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, మండలంలోని రామకృష్ణ కాలనీలో గల గన్నేరువరం మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులకు స్నేహిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రూరల్ సీడీపీఓ సబితా ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. న్యూట్రిషన్ ఫుడ్, బాల్య వివాహాలు, బాల బాలికలు యుక్త వయస్సులో మార్పుల వలన తెలిసి తెలియక తప్పుతోవ పడుతున్నారని అన్నారు. మంచి లక్ష్యం ఏర్పాటు చేసు కొని విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన ఉండాలని, స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్ వినియోగంలో పిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు గురి కాకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, ఏసిడిపివో అరవింద, ప్రిన్సిపాల్స్ వామన్ రావు, మధుసూదన్, సూపర్‌వైజర్లు శ్రీలత, పద్మ, పంచాయతీ కార్యదర్శి మహేందర్, సోషల్ వర్కర్ రమేష్, ఏఎన్‌ఎం రోజా, షీ టీం విజయమణి ఉన్నారు.

సమ్మక్క జాతరకు ఆర్టీసీ ఆర్ఎం గేట్‌మీటింగ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 16: ఈ నెల 18 నుంచి జరిగే సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరంచుకుని శుక్రవారం ఆర్టీసీ కరీంనగర్‌రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే మేడారం జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేని ప్రయాణ అనుభూతిని కల్పించి వారి మన్ననలు పొందాలన్నారు. జాతర సందర్భంగా డ్రైవర్లు బస్సులను ఓవర్‌టేక్ చేయకుండా క్రమ పద్ధతిలో వాహనాలను నడపాలన్నారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశంలేకుండా ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్‌లు ఎస్ భూపతిరెడ్డి, కె సత్యనారాయణ, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, విమల్లయ్య సూపర్‌వైజర్లు నజీర్, వీరస్వామి, విజయలక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.



ఆర్టీసీలో గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్ఎం సుచరిత

భక్తులతో కిక్కిరిసిన రాజన్న క్షేత్రం



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ, ఫిబ్రవరి 16 : దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం అశేష భక్తజనంతో కిక్కిరిసి పోయింది. మేడారం సమ్మక్క సారక్క జాతర నేపథ్యంలో రాజరాజేశ్వరస్వామివారికి తొలి మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వేలాది మంది భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. శుక్రవారం సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి మహా మండపంలో రుద్రాభిషేకం అన్న పూజ తదితర ఆర్జిత సేవలను రద్దు చేశారు. దీంతో క్యూ లైన్‌లు వేగంగా కదిలి భక్తులకు స్వామివారి దర్శనం కలిగే అవకాశం లభించింది. అనుబంధ ఆలయ మైన బద్ది పోచమ్మ ఆలయం లోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



స్వామివారిని దర్శించుకున్న భక్తులు

యమధర్మరాజు ఆలయంలో అభిషేకం





స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 16:ధర్మపురిలోని యమ ధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేద పండితులుబొజ్జ రమేష్ శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల సంతోష్‌కుమార్, ఒద్ది పర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో కూడ స్వామి వారలను భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్‌గా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్



సిరిసిల్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్ట్ర స్థాయి పదవి వరించింది. ఇప్పటికే వక్ఫ్ బోర్డు డైరెక్టర్లను నియమించగా శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లాలోని గంభీరావుపేటకు చెందిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్‌గా ఎన్ను కున్నారు. అజ్మతుల్లా హుస్సేన్ 23 ఏళ్లుగా కాంగ్రెస్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ కన్వీనర్‌గా పని చేస్తున్నారు. యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధిగా పనిచేశారు. జాతీయ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా, కార్యదర్శిగా, కో ఆర్డినేటర్‌గా, ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.దీంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ వివిధ బాధ్యతల్లో పనిచేసిన అనుభవం ఉంది. వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా అజ్మ తుల్లా నియామకంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కార్గో ద్వారా మేడారం సమ్మక్క ప్రసాదం

భగత్‌నగర్, ఫిబ్రవరి 16: మేడారం వెళ్లి సమ్మక్క సారలమ్మలను దర్శించుకోలేని వారి కోసం ఆర్టీసీ ప్రసాదాన్ని ఇంటి వద్దకే అందించనున్నట్లు ఆర్టీసీ కార్గో ఏటీఎం ఎస్ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. మేడారం వెళ్లలేని భక్తులు 299 రూపాయలు చెల్లించి ప్రసాదం కోసం బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీ తర్వాత వారికి ఇంటి వద్దకే అమ్మవారి ప్రసాదం అందించడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ కల్పించిన ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

ఆసుపత్రిపై దాడి : కేసు నమోదు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 16: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి, వైద్యుడిపై దాడిన చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి శుక్రవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన అబ్బూరి చిన్న మల్లయ్య మూడు రోజుల క్రితం మృతి చెందాడు. ఆయన మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ మృతుడి బంధువులు ఆసుపత్రిలోని ఫర్నీచర్ ధ్వంసం చేసి వైద్యుడిపై దాడి చేశారు. ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుడి ఫిర్యాదు మేరకు అబ్బూరి మహేష్‌గౌడ్, అశోక్‌గౌడ్, రాకేష్‌గౌడ్, అల్వాల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడి ఘటనకు నిరసనగా పట్టణంలోని ఐఎమ్‌ఏ ఆధ్వర్యంలో ప్రైవేటు ఆసుపత్రులు బంద్ పాటించాయి.

నకిలీ ధ్రువపత్రాల కేసులో పోలీసు కస్టడీకి నిందితులు



సోదాలకు వెళుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: వివా దంలో ఉన్న భూమికి నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి విక్రయం పేరిట కోటి 37 లక్షలు వసూలు చేసిన కేసులో అరెస్టు అయి జైలులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను కొత్తపల్లి పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్ శివారులోని రేకుర్తిలో వివాదంలో ఉన్న భూమిని నకిలీ పత్రాలతో వేములవాడకు చెందిన గునుకుల రాజిరెడ్డి అనే వ్యక్తికి విక్రయించి అతని వద్ద కోటి 37 లక్షలు కాజేసినట్లు బాధితుడు ఫిర్యాదుతో ఈ నెల 9న 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్, 18వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్, మరో వ్యక్తి ఏలేటి భరత్ రెడ్డిలపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అప్పటి నుంచి జైలులో ఉన్న ముగ్గురు నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు పోలీ సులు కస్టడీ పిటిషన్ వేయగా కోర్టు అనుమతిం చింది. ఈ మేరకు ఒక రోజు కస్టడీకి తీసుకున్నారు. అనంతరం కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిందితుల ముగ్గురి ఇళ్లలో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ముగిసిన జంగిలి సాగర్ పోలీసు కస్టడీ

మరో వైపున భూకబ్జా, బెదిరిం పులకు సంబంధించిన కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను మరోమారు కొత్తపల్లి పోలీసులు గురువారం కస్టడీకి తీసుకుని విచారణ అనంతరం శుక్రవారం మళ్లీ జైలుకు తరలించారు.

రాజన్న సేవలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్



కోడె మొక్కు చెల్లించుకుంటున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

వేములవాడ, ఫిబ్రవరి 16: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వ చనం, ఆలయ సూపరింటెండెంట్ బి.తిరుపతిరావు, ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాము లు ప్రసాదం అందజేశారు. అంతకుముందు రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వేములవాడకు వచ్చిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ను స్థానిక బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, యువజన విభా గం నాయకుడు వెంగళ శ్రీకాంత్ గౌడ్, యామ తిరుపతి, పోతు అనిల్, విజయ్ యాదవ్, శ్రీధర్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

కరెంట్ మోటార్ల దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 16: జిల్లాలో వ్యవసాయ బావుల వద్ద కరెంట్ మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల అంతర్ జిల్లా దొంగలను ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన అజ్గర్ పాషా చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. తనకు పరిచయమైన వరంగల్ జిల్లా కొత్తగూడ మండలం వెలుబల్లికి చెందిన బానవేణి నాగరాజు, వేములవాడకు చెందిన నీలం మౌనిష్, దండు శ్రీకాంత్‌తో కలిసి జిల్లాలోని వివిధ గ్రామాలలో వ్యవసాయ బావుల వద్ద ఉన్నటువంటి మోటా ర్లను దొంగిలించారు. ఆ మోటార్లను సోహెల్ అనే వ్యక్తికి విక్రయించారు.

వచ్చిన డబ్బుతో జల్సాల చేసుకు న్నారు. దొంగతనం చేసిన మోటార్లను సోహెల్‌కు ఇచ్చి రావడానికి కార్లు అద్దెకు తీసుకొని వెళ్లే వారు. దొంగతనం చేసిన కరెంటు మోటార్లను శుక్రవారం కారులో కామారెడ్డికి వెళ్లి అమ్మాలనుకున్నారు. మర్రిపల్లి గ్రామ శివారువద్ద రూరల్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. దొంగలించిన 4,78,000 రూపాయల విలువైన 33 కరెంటు మోటార్లు, దొంగతనాలకు ఉపయో గించిన 5 కార్లను, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న కామా రెడ్డికి చెందిన సోహెల్‌ను త్వరలోనే పట్టుకుంటామన్నారు. వేముల వాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి ఉన్నారు.

సింగాపూర్‌లో దొంగల హల్‌చల్

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని సింగాపూర్‌లో తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు శుక్రవారం చోరీలకు పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రమీల అనే మహిళ ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.95 వేలు విలువ చేసే బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యక్తి ఇంటి తాళాలను పగలగొట్టి విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయిననట్లు గ్రామస్థులు తెలిపారు. దొంగతనంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో రెండిళ్లలో చోరీ జరిగింది. లక్ష్మీపూర్ కాలనీకి చెందిన పసుల నర్సయ్య ఇంటి తాళం పగల గొట్టి బీరువాలో ఉన్న ఆర తులం బంగారంతోపాటు 20 తులాల వెండి ఆభరణాలు, రూ. 9 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా అట్టెల నర్సయ్య ఇంటి తాళం పగలగొట్టిన దొంగలు రూ.3 వేల నగదును దొంగతనం చేశారు. పక్కనే పసుల మల్లేశం ఇంటి తాళం పగలగొట్టి చోరీకి యత్నించారు. విషయం తెలుసుకున్న సీఐ సదన్‌కుమార్ చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. దొంగల ఆచూకీ కోసం క్లూస్ ఆధారాలు సేకరించింది.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 16: జమ్మికుంట మండలం రంగమ్మపల్లి గ్రామానికి చెందిన బాలసాని శ్రీనివాస్ ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వృత్తిలో భాగంగా పెద్దంపల్లిలో తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన తోటి గీత కార్మికులు మెరుగైన చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వం స్పందించి గీత కార్మికుడిని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 16: కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల గ్రామంలో దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం... 27 జూలై 2017న వట్టిమల్ల గ్రామానికి చెందిన బండ రాజు, కుమ్మరి మల్లయ్య కలిసి వైన్ షాప్‌లో మద్యం కొనుగోలు చేశారు. ఆ సమయంలో కోనరావుపేటకు చెందిన బాబు అకారణంగా బండ రాజుపై బాటిల్, రాళ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో తప్పించుకునేందుకు ప్రయత్నించిన రాజు ప్రహరీ పైనుంచి దూకగా కుడికాలు విరిగిపోయింది. ఈ సంఘటనపై అప్పటి ఎస్సై రమేశ్‌నాయక్ కేసు నమోదు చేశారు. సాక్షులను విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సందీప్ వాదించగా కోర్టు కానిస్టేబుల్ మోహన్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ నిందితుడు బాబుపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించారు.

కాళేశ్వరం జలాలతో అన్నపూర్ణ రిజర్వాయర్ నింపాలి



పెద్దలింగాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16: మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌ను కాళేశ్వరం జలాలతో నింపాలని రైతులు డిమాండ్ చేశారు. అన్నపూర్ణ రిజర్వాయర్ దిగువన వ్యవసాయ భూములు ఉన్న పెద్దలింగాపూర్, అనంతగిరి గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం పెద్దలింగాపూర్ సమీపంలో రాస్తారోకో చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు ఉంటుందని భావించి పంటలు వేశామన్నారు. రిజర్వాయర్ నీరు డెడ్ స్టోరేజీకి చేరడంతో ఇప్పటికే పంటలు ఎండిపోయాయన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోదా? అని ప్రశ్నిం చారు. రిజర్వాయర్‌లో నీరు ఉంటే భూగర్భ జలాలు పెరగడంతో పాటు సీపేజీ నీటితో ఏటా పంటలు పండుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యమానేరు నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విషయం తెలుసుకున్న పోలీసులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు అమ్ముల అశోక్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, మల్లవ్వ, పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ కార్మికుడి మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: గోదావరిఖని గంగానగర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి రెడ్డిపాక మొండయ్య మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య తెలిపారు. ఉదయ్ నగర్‌లో గురువారం సాయంత్రం పెరుగు కొనుగోలు చేసుకుని రాజీవ్ రహదారి దాటుతుండగా మంచిర్యాల నుంచి గోదావరిఖనికి ద్విచక్ర వాహనంపై వస్తున్న మార్కండేయకాలనీకి చెందిన మురళీధర్ అనే వ్యక్తి మొండయ్యను ఢీకొట్టడంతో అతని డివైడర్‌పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి అల్లుడు చంద్రగిరి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన ముగ్గురు వాహన దారులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఇటీవల పట్టుబడిన 12 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ ము న్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 10 రోజులు, మరొకరికి ఐదు రో జులు, ఇంకొకరికి మూడు రోజుల వంతున జైలుశిక్ష లేదా మొత్తం రూ. 7,500 ల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని తెలిపారు. మిగతా 9 మంది వాహనదారులకు రూ. 14వేలు జరిమానా విధించారని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: గోదావరిఖని తిలక్‌నగర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం గోదావరిఖని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మోహన్ గుప్తా చుట్టు పక్కల వారి వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి తిలక్‌నగర్‌లోని ఓ ఇంట్లో నిల్వ చేయగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

కేబుల్‌బ్రిడ్జి ఐలాండ్ వద్ద సిమెంట్ లారీ బోల్తా




బోల్తాపడ్డ సిమెంట్ లారీ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: కరీంనగర్ శివారులోని రాజీవ్ రహదారిపై కేబుల్‌బ్రిడ్జి ఐలాండ్ వద్ద గురువారం అర్ధరాత్రి సిమెంట్ లారీ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. గోదావరిఖని వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ ఐలాండ్ వద్ద టర్న్ చేసే సమయంలో అదుపుతప్పి బోల్తాపడగా డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయని పోలీసులు తెలి పారు. ఐలాండ్ వద్ద రోడ్డుపై భారీ ట్యాంకర్ బోల్తా పడటంతో రాజీవ్ రహదారిపై గోదావరి ఖని నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. రాత్రి నుంచి పలుమార్లు వాహనాలు భారీ సంఖ్యలో నిలిచి పోగా పోలీసులు సాయంత్రం ట్యాంకర్‌ను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన పైండ్ల అంజయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో జైలు శిక్ష, జరిమానా విధించారు. అంజయ్య విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో అధికారులకు పట్టుబడిన కేసులో జగిత్యాల జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి 10,896 రూపాయల జరిమానా లేదా 4 నెలల జైలుశిక్ష విధించినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

గుండెపోటుతో సీసీఆర్‌బీ ఎస్‌ఐ మృతి



ఎస్‌ఐ లింగారెడ్డి (ఫైల్)

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16: సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన లింగారెడ్డి అనే ఎస్‌ఐ శుక్రవారం కరీంనగర్ తిరుమల్‌నగర్‌లో తన ఇంటిలో గుండెపోటుతో మరణించాడు. ఆయనకు భార్య, కొడుకు, కూతురులు ఉన్నారు. లింగారెడ్డి కుటుంబ సభ్యులను అడిషనల్ డీసీపీ సి రాజు పరామర్శించారు. ఎస్‌ఐ లింగారెడ్డి కామారెడ్డి నుంచి బదిలీపై కరీంనగర్ సీసీఆర్‌బీ ఎస్‌ఐగా వచ్చారు. గురువారమే ఆయన విధులకు రిపోర్ట్ చేశారు. లింగారెడ్డి అంత్యక్రియలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని, పోలీసుశాఖ వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీతో పాటు సీసీఆర్‌బీ ఏసీపీ జి విజయ్‌కుమార్, హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాసులు, హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, పోలీస్ వెల్ఫేర్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 16: జాతీయ యువజన పార్లమెంటు ఉత్సవాల్లో భాగంగా జాతీయస్థాయి ఉపన్యాస పోటీలను నిర్వహి స్తున్నట్టు తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి ఎం వెంకటరాంబాబు తెలిపారు. ఈ పోటీలను కొన్ని జిల్లాల వారిగా విభజించి ఆన్‌లైన్ ద్వారా ఈ పోటీలను నిర్వహి స్తోంది. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో గెలిచిన వారు జాతీయస్థాయి పోటీలకి ఎంపిక అవుతారు.జాతీయ స్థాయిలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రెండు లక్షల నగదు, రెండో బహుమతి లక్ష యభైవేయిలు, మూడో బహుమతి లక్ష రూపాయలు, ప్రోత్సాహక బహుమతులు ఇద్దరికీ 50 వేల చొప్పున ఇవ్వబడతా యని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ 2024 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలని, మై యువ భారత్ అనే కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే అర్హులని తెలిపారు.

ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నల్గొండ జిల్లాల అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు. అభ్యర్థులు 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు www.mybharat.gov.in వెబ్‌సైట్ ద్వారా అనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలు 20వ తేదీ ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా యువజన అధికారి, నెహ్రూ యువ కేంద్రం, కరీంనగర్ ఆఫీసు సమయాల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

కదంతొక్కిన కార్మికులు

- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ
- లంచ్ హవర్‌లో ఉద్యోగుల ధర్నా
- గ్రామీణ భారత్ బంద్‌కు రైల్వే కార్మికుల మద్దతు



గోదావరిఖనిలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



రాస్తారోకో నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న క్యాబ్ అసోసియేషన్ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 16: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని నరేంద్రమోదీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గద్దె దింపాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వేల్పుల కుమార్, ఈదునూరి నరేష్, రాజేందర్, తోకల రమేష్, నిమ్మకాయల ఏడుకొండలు, రామన్న, నిమ్మకాయల ఏడుకొండలు, మొండెద్దుల మల్లేష్ పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా శుక్రవారం ఇచ్చిన గ్రామీణ బంద్ సందర్భంగా గోదావరిఖనిలో విప్లవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పెట్టుబడిదారులకు వంత పాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. ఇప్పటికైనా మోదీ కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, దుర్గయ్య, రవికుమార్, రాములు, బేతి రవి, వీరేశం, సాంబయ్య, శివ కుమార్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర క్యాబ్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు మొండెద్దుల మల్లేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్‌ను రద్దు చేయాలని, మోటార్ వాహన చట్టం 2019ని సవరించాలన్నారు. క్యాబ్‌డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని, జిల్లాలో వాహనాల పార్కింగ్ కోసం స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ నిరసనలో ప్రధాన కార్యదర్శి బేతి రవి, ఉపాధ్యక్షులు వీరేశం, చాట్ల దిలీప్, పంజాల శ్రీనివాస్, పరుశరాం, మామిడి రాజయ్య, గాదం బాస్కర్, జనార్థన్, శ్రీనివాస్, సది, మొగిలి, నేతాజీ, రవి, సుమన్, మహేందర్, వేణు పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ సందర్భంగా గోదావరిఖని లేబర్ కోర్టు పైలాన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ కృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఎస్‌టీని ఉపసంహరించుకోవాలని, కనీస పెన్షన్ రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఈదునూరి నరేష్, దుర్గయ్య, రవికుమార్, సాంబయ్య, చంద్రయ్య, శ్రీకాంత్, శివకుమార్, రూపేష్, శ్రావణ్, ధర్మేందర్, రాకేష్ పాల్గొన్నారు.

కోల్‌సిటీ, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మున్సిపల్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. టీఆర్ఎస్ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. కార్మికులనుద్దేశించి సీఐటీయూ నాయకులు యాకయ్య, టీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం నాయకుడు మురళీధర్‌రావు మాట్లాడారు. కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, వారిని పర్మినెంట్ చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని డిమాండు చేశారు.

అంతర్గాం, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌కు సీఐటీయూ అనుబంధ రైల్వే కాంట్రాక్టు కార్మిక సంఘాల మద్దతు ప్రకటించింది. రైల్వే కార్మికులు శుక్రవారం భారత్ బంద్‌లో భాగంగా ఆర్‌టీహెచ్ షెడ్డు నుంచి రైల్వే స్టేషన్ వరకు కార్మికులతో ర్యాలీ నిర్వహించి రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం రామాచారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు బిక్షపతి, మాచర్ల అశోక్, మహేష్, కార్మికులు పాల్గొన్నారు. అదే విధంగా ఎన్‌టీపీసీ డ్యామ్ సమీపంలోని సోలార్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు చిలుక శంకర్, ఎండీ సాజిద్, కార్మికులు పాల్గొన్నారు.



జూలపల్లిలో వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 16: దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి సునీల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, అశోక్, టీఎన్‌టీయూసీ నాయకులు సల్ల రవీందర్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు రత్నకుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సీపీఎం జిల్లా కార్యదర్శి వై, యాకయ్య, వివిధ సంఘాల నాయకులు భీమయ్య, ఐ, కృష్ణ, ఎస్, వెంకటస్వామి, బొంకూరి సాగర్, జ్యోతి, సురేష్, ఎండి, కాజానరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పలు ఉద్యోగ సమస్యల సాధనకు శుక్రవారం అఖిల భారత ఉద్యోగ సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏఐఎస్‌జీఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మారం జగదీష్ ఆదేశాల మధ్యాహ్నం ఒంటి గంటకు భో జన విరామ సమయంలో కలెక్టరేట్ ఐడీవోసీ ఎదుట ప్రభుత్వ ఉద్యోగులం దరూ నల్ల బ్యాడ్జీలు ధరించి లంచ్ అవర్‌లో చేపట్టిన ధర్నా విజయవంత మయ్యింది. టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి మేనేని సందీప్‌రావు, ఆడెపు శ్రీనివాస్, కొమురయ్య, అయిరెడ్డి సందీప్‌రెడ్డి, ఆకుల సురేష్, విజయపాల్‌రెడ్డి, అంజి, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, విష్ణువర్ధన్, శ్రీనివాస్, అనిత, శిల్పారెడ్డి, స్వప్న, ప్రవీణ్, సురేందర్, రాజారత్నం, ప్రశాంత్ పాల్గొన్నారు.

జూలపల్లి, ఫిబ్రవరి 16 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,కర్షక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో కార్మికులు సమ్మెను చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ఎండగడుతూ కార్మికులు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన కార్మికులు తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఆసంపెల్లి బానయ్య, వైద్య సంపత్‌కుమార్, ఎండి అప్సర్, సత్యం, నాగేశ్వర్, వేల్పుల బాస్కర్, వెంకటేశం, రాజేశం, స్వామి, సంపత్, లచ్చయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మంథని, ఫిబ్రవరి 16: కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఐటీయూ కార్మికులు శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా మంథనిలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ గిరి ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గణేష్, వనజారాణి, సుగుణ, రాజయ్య, చందు, సింగారం గట్టయ్య, కార్మికులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 16 : మండల కేంద్రంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు అంబాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల పిలుపు మేరకు గ్రామపంచాయతీ కార్మికులు గ్రామీణ భారత్ బంద్, సమ్మె నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ జాహెద్ పాషాకు విన తిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, మండల అధ్యక్షుడు అంబాల లక్ష్మణ్, కవ్వంపల్లి కుమారస్వామి, చెప్యాల మహేష్, లత, స్వరూప, సంపత్, లక్ష్మీనర్సు లక్ష్మణ్, సంపత్, రవితేజ, గౌసుద్దీన్, గట్టయ్య, రాజబాబు, రవి, సమ్మయ్య, పోచాలు, శ్రీనివాస్, స్వామి, మొగిలి, మహేష్, సురేష్ ఉన్నారు.


సమ్మెలో పాల్గొన్న రామగుండం పారిశుధ్య కార్మికులు



రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు



కాల్వశ్రీరాంపూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



సమ్మెను నీరుగార్చిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల రాజిరెడ్డి

గోదావరిఖని, ఫిబ్రవరి 16: దేశవ్యాప్తను ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నీరుగార్చడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతు సంఘాలతో పాటు కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సమ్మె నోటీసు ఇవ్వడానికి చూపిన శ్రద్ధ కేంద్ర ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించడానికి ముందుకు రాలేదని, ఐఎన్‌టీయూసీ కేవలం నల్లబ్యాడ్జీలతో నిరసనతోనే సరిపెట్టుకున్నదని, ఏఐటీయూసీ సమ్మె చేయమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 50శాతానికిపైగా కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారన్నారు. ఇప్పటికైనా కార్మికులను వంచించడం మానుకోవాలని, సమ్మెకు తూట్లు పొడిచే విధానాలు సరికాదని, కోల్ ఇండియాలో సమ్మె జరుగుతుంటే సింగరేణిలో మాత్రం యాజమాన్యానికి అనుకూలంగా కార్మిక సంఘాలు ఫోన్లు చేయించి కార్మికులను డ్యూటీలకు పిలిపించుకున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో ఆర్‌జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్, నాయకులు ఆసరి మహేష్, పీఆర్ చారి, గౌస్, నారాయణ, శంకర్, మల్లేష్, వెంకటేశ్వర్లు, రాజు, సురేష్, సత్యనారాయణ, సుభాష్ పాల్గొన్నారు.

కొత్త గనులు కేటాయించి సంస్థను కాపాడండి

గోదావరిఖని, ఫిబ్రవరి 16: సింగరేణి కొత్త గనులను కేటాయించి సంస్థను కాపాడాలని, తద్వారా దాదాపు 40వేల మంది కార్మిక కుటుంబాలను రక్షించిన వారవుతారని కోల్ సెక్రెటరీ అమృత్‌లాల్ మీనాకు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో కోల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం అందజేశారు. 2030నాటికి సింగరేణి సంస్థలో పాత గనులు మూతపడి కిష్ట పరిస్థితులు ఏర్పడనున్నాని, ఈ తరుణంలో కొత్త బ్లాకులను కేటాయించి 13దశాబ్దాల చరిత్ర గల సింగరేణిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దేశ బొగ్గు అవసరాలు తీర్చడంలో సింగరేణి సంస్థ ఎప్పుడూ ముందుంటుందని, థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ రంగాల్లో కూడా ప్రవేశించిన సింగరేణి దేశానికే ఆదర్శంగా ఉందన్నారు. ఇటువంటి సంస్థను కాపాడుకోవడం ద్వారా సింగరేని ఆధారిత పరిశ్రమలు, ప్రజలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని వివరించారు. దీనిపై కోల్ సెక్రటరీ మాట్లాడుతూ సింగరేణి సంస్థను తప్పక రక్షిస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం ఏ మాత్రం లేదని హామీ ఇచ్చినట్టు జనక్ ప్రసాద్ తెలిపారు.

కొత్త గనుల ఏర్పాటుకు పూర్తి సహకారం

- బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి పనితీరు భేష్ - కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా

గోదావరిఖని, ఫిబ్రవరి 16: సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు, సంస్థ అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా హామి ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఈ ఏడాది నిర్దేశించిన 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందుండడం అభినందనీయమన్నారు. సింగరేణి చేపట్టి వ్యాపార విస్తరణ చర్యలు భేష్‌గా ఉన్నాయని, థర్మల్, సోలార్, జియో థర్మల్, ఓబీ నుంచి ఇసుక తయారీ, కమర్షియల్ ఇసుక తయారీపై మీన అభినందనలు తెలిపారు. సింగరేణిప్రాంతంలో మూడు బొగ్గు బ్లాకులు సింగరేణి సంస్థకే కేటాయించాలని సీఎండీ బలరాంనాయక్ అమ్రిత్ లాల్ మీనాను కోరగా రానున్న కాలంలో చేపట్టనున్న కొత్త గనులకు త్వరితగతిన అనుమతులు లభించేలా చూడాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి సింగరేణికి మేలు కలిగే విధంగా తగిన సహకారాన్ని అందిస్తామని హామి ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో కేంద్ర బొగ్గుశాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ బ్రార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్, సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణ, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, అల్విన్, సురేష్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అమ్రిత్‌లాల్ మీనా

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో భేటి

సింగరేణిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో బొగ్గుశాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీన, సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌లు సచివాలయంలో సమావేశమయ్యారు. సమస్యలపై వారు చర్చించారు.

నల్ల బ్యాడ్జీలతో కార్మికుల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన సింగరేణి కార్మికులు

గోదావరిఖని, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌కు ధారదత్తం చేయడాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా శుక్రవారం జరిగిన సమ్మె పట్ల సింగరేణి కార్మికవర్గం సానుకూలంగా స్పందించ లేదు. సమ్మె రోజు కార్మికులంతా యాధవిధిగా విధులకు హాజరయ్యారు. ఐఎన్‌టీయూసీకి సంబంధించిన కార్మికులు విధులకు హాజరై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్‌లు కూడా సమ్మె విజయవంతానికి చేయాల్సిన కృషి చేయలేదు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ మాత్రమే సింగరేణిలో సమ్మెకు ప్రయత్నించినప్పటికీ కార్మికవర్గం స్పందించలేదు. ఆర్‌జీ-1,2,3 ప్రాంతాల్లో కార్మికులు సమ్మెలో పాల్గొనలేదు. హాజరుశాతం కూడా మాములు రోజులాగానే ఉంది. సమ్మె సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు, సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది తగిన రక్షణ జాగ్రత్తలు తీసుకుంది.

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 16: జాతీయ కార్మిక సంఘాల సమ్మె శుక్రవారం ఆర్జీ-2 ఏరియాలో పాక్షికంగా జరిగింది. పర్మినెంట్ కార్మికులు యధావిధిగా విధులకు హాజరయ్యారు. ఓబీ కార్మికులు కొంతమేర సమ్మెలో పాల్గొన్నారు. సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, ఇఫ్టూ ఆధ్వర్యంలో గనులపై నిరసనలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసగా నల్లబ్యాడ్జీలు ధరించి కార్మికులు విధులకు హాజరయ్యారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కాలనీలో బైక్‌ర్యాలీ నిర్వహించారు.


ఓసీపీ-1లో నల్లబ్యాడ్జీలతో ఐఎన్‌టీయూసీ నాయకులు నిరసన

ఓసీపీ-1 ప్రాజెక్టులో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

రామగిరి, ఫిబ్రవరి 16: ఆర్జీ-3,ఏపీఏ డివిజన్‌లలో శుక్రవారం కార్మిక సంఘాలు ఇచ్చిన టోకెన్ సమ్మె ప్రభావం కనిపించలేదు. ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలోని గనులు, డిపార్టమెంట్‌ల ఎదుట కార్మిక సంఘాలైన ఏఐటీయుసీ, సీఐటీయు నేతలు నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, కొంరయ్య, మర్దన్ కిరణ్‌కుమార్, సురేష్, విష్ణు, కార్మిక నేతలు పాల్గొన్నారు.


ఆర్జీ-3లో కార్మికుల నిరసన

జాతరకు ముమ్మర ఏర్పాట్లు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని హన్మంతునిపేటలో ఈనెల 21 నుంచి నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ పోల్సాని సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం హన్మంతునిపేట సమ్మక్కసారలమ్మ గద్దెల వద్ద భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బోర్‌వెల్‌ను అందించగా ఆలయ ఛైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గౌరెడ్డిపేట మాజీ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్, బయ్య కోమురయ్య, దామ కనుకయ్య, బండి సతీష్,మేకల లక్ష్మణ్, పూదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని రాంపల్లి గ్రామ పంచాయితి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి శుక్రవారం అధికారులు శాలువాలతో సత్కరించారు. వారం రోజుల పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొన్నందుకు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ స్పెషల్ అధికారి నరేష్, పంచాయితి సెక్రటరి శంకరయ్య, మాజీ సర్పంచ్ కనపర్తి శ్రీలేఖ-ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మేజిక్ రాజాకు సత్కారం



మేజిక్ రాజాను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 16: గోదావరిఖనికి చెందిన హస్య కళాకారుడు మేజిక్ రాజాను హైదరాబాద్ ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఘనంగా సత్కరించింది. ఇటీవల హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలోని కళా లలిత కళావే దికలో ఫ్రెండ్ కామెడీ క్లబ్ నిర్వహించిన కార్యక్రమంలో మేజిక్ రాజా ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ అలరించాయి. కాగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంవి సుబ్రహ్మణ్యం, సినీ, టీవీ నటులు బుగత సత్యనారాయణ, విద్యాసాగర్ మేజిక్ రాజాను సన్మానించారు.

కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి

ధర్మారం, ఫిబ్రవరి 16: విజయవాడ కనకదుర్గ అమ్మవారిని శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్-స్నేహలత దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో కొప్పుల ఈశ్వర్-స్నేహలత దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దంపతులకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సన్మానం

ధర్మారం, ఫిబ్రవరి 16: మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో జయశీలకు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, తహసీల్ధార్ ఏ. రజిత, వైస్‌ఎంపీపీ మేడవేని తిరుపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పూస్కూరి జితేందర్ రావు, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ముత్తారం ఫిబ్రవరి 16: మండలంలోని ఖమ్మంపల్లి(జిల్లెలపల్లి) గ్రామానికి చెందిన వేముల స్వరూపకు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,50,000 మంజూరు చేయించి మంత్రి శ్రీధర్‌బాబు ఆసుపత్రి సహాయకులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందచేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ముత్తారం ఫిబ్రవరి 16: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన చల్ల లింగయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం పరామర్శించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు చెల్కల జితేందర్‌యాదవ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నర్ర మల్లయ్య, మాజీ ఎంపీటీసీ బండ సమ్మయ్య, మేకల ఓదెలు, చెల్కల కాంతయ్య ఉన్నారు.

డీపీవోను కలిసిన ఎంపీవోలు


డీపీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీవోలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16: ఇటీవల జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన లతను జిల్లాలోని పలు మండలాల ఎంపీవో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీపీవోను కలిసిన వారిలో డిఎల్‌పీవోలు వేణుగోపాల్, శంకర్, ఎంపీవోలు అనిల్‌రెడ్డి, ఫయాజ్, సాబీర్‌పాష, అబ్దుల్ వాజీద్, సుదర్శన్, సూరి, గోవర్ధన్, వేణుమాధవ్, అరీఫ్, సమ్మిరెడ్డి, కిరణ్, రమేష్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఉదయసాహితి జిల్లా అధ్యక్షకార్యదర్శుల నియామకం

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 16 : ఉదయసాహితి (సాహిత్య వికాస వేదిక) జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా తడిగొప్పుల కుమారస్వామి, బాలసాని కొమురయ్యను నియమించినట్లు సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దాస్యం సేనాధిపతి, రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం పెద్దపల్లిలో 2024-26 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సలహాదారులుగా బుర్ర తిరుపతి, గౌరవాధ్యక్షుడిగా డా పుప్పాల చైతన్య, అధ్యక్షుడిగా తడిగొప్పుల కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా దామెరకుంట శంకరయ్య, మహర్షి మల్లయ్య, బొమ్మిదేని రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి బాలసాని కొమురయ్య, సహాయకార్యదర్శులుగా గుండు రమణయ్య, అనాసి జ్యోతి, మహిళా కార్యదర్శి అనూ గౌరోజు, ప్రచార కార్యదర్శి దార స్నేహలత, కోశాధికారి అవధానుల గీతారాణి, కార్యవర్గ సభ్యులను నియమించినట్లు పేర్కొన్నారు.

మాదిగ హక్కుల పరిరక్షణ సమితి గ్రామ కమిటీ

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని రాగినేడులో శుక్రవారం మాదిగ హక్కుల పరిరక్షణ సమితి గ్రామ కమిటీని జిల్లా అధ్యక్షుడు రాజమల్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంకుడు తిరుపతి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా సది, గౌరవధ్యక్షులుగా మల్లేష్, ఉపాధ్యక్షులుగా వెంకటి, కాదాశి పద్మయ్య, ప్రధాన కార్యదర్శిగా కాశిపాక రాజయ్య, సంయుక్త కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా చిన్న, కార్యదర్శిగా మహేందర్‌ను ఎన్నుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏబీసీడీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భర్త మృతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16: సుల్తానాబాద్ మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ముత్యం సునీత భర్త, బీఆర్ఎస్ నాయకులు ముత్యం రమేష్(45) గుండెపోటుతో మరణించారు. శుక్రవారం ఉదయం ఇంట్లో స్నానం చేస్తుండగా గుండెపోటుతో స్నానాల గదిలో పడిపోయారు. గమనించిన కుటుంబసభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఇటీవల ముత్యం సునీతపై మెజారిటీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. దాంతో ఆమె తన పదవిని కోల్పోయారు. ముత్యం రమేష్ అకాల మరణంపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బాధితురాలికి ఆర్థిక సహాయం

రామగిరి, ఫిబ్రవరి 16: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని గోకుల్‌నగర్‌కు చెందిన గంగినేని రాజక్క అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఇబ్బంది పడుతుందనే సమాచారం మేరకు శుక్రవారం రామగిరి సేవ సమితి సభ్యుల సహకారంతో విరాళంగా సేకరించిన ఐదు వేల రూపాయల నగదు, 25 కిలోల బియ్యంను బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, నాయకులు సదయ్య, పరుశురామ్, మేకల మారుతీ, కొప్పుల సునీల్, శీలంరాజు, కుమార్, కొయ్యడ, కిరణ్, రాము, అనిల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.